24

# ధనానికతీతముగా సంఘమును ప్రేమించిన శ్రీశేషుదేవులు శ్రీలక్ష్మీపుత్రుడైయున్నారు

శ్రీ గురుదేవులు ఎల్లప్పుడూ తన మనో, వాక్, కర్మలలో సంపూర్ణముగా ధనమును మించి సత్యసంఘమును, శిష్యులను ప్రేమించినారు. సంఘ అవసరాల కొరకు తన ధనమును నిస్సంకోచముగా, సంపూర్ణముగా వినియోగించేవారు. తన కుటుంబమును కూడా సంఘసేవకే ఉపయోగపడేలా తీర్చిద్దినారు. తనకున్న సంపద అంతటిమీద అజమాయిషీని పూర్తిగా సంఘమునకు, శిష్యులకే ఇచ్చినారు. ఆస్తుల యెడల ఇష్టత లేని ఆయన సంఘము కొరకే ఆస్తులను తగుమాత్రముగా సమకూర్చినారు. ఆయన దేహముతో మన మధ్య ఉన్నప్పుడే కాకుండా దేహమును వదలి అవతార కార్యక్రమమునకు వెళ్ళిన తరువాత కూడా , చాలా ఏళ్ళు అయినను ఇప్పటికీ తన ఆస్తులన్నింటినీ సంఘమునకే ఉపయోగపడేలా సంఘము అజమాయిషీలోనే ఉండేలా ముందుగానే ఏర్పాట్లు చేసియున్నారు. తన సంపద యెడల తాను కేవలం ధర్మకర్తగానే భావించుకుంటూ తన సంపదను పూర్తిగా సత్యము కొరకే ఉపయోగపడాలని కోరుకుంటూ ఆ విధముగా సంపూర్ణముగా ఉపయోగించిన బాహ్యాతీతులైయుండియు, పైకి మాత్రము బాహ్యాసక్తి కలిగిన వానిగా నటిస్తూ మాయా ముసుగు ధరించి తనలోని త్యాగమును, వైరాగ్యమును రహస్యము చేసుకొనిన ఊహాతీతుడు శ్రీ శేషబాబుగారు.

ఎవ్వరైతే బాహ్యసంపద కలిగియుండియు బాహ్యము వలన ఎట్టి మాయా వ్యామోహములకు లోనవకుండా ఉండి, అది అంతయు భగవత్ప్రసాదితమేనని గుర్తించుకుంటూ ఉండి, దానికి హక్కుదారుడు భగవంతుడేనని తాను కేవలము ధర్మకర్తను మాత్రమేనని గ్రహించుకుంటూ జీవిస్తారో వారికి ధనము భారము కాదు. ధనము వారిని ఏ మాత్రము బంధించలేదు. వారికి శ్రీ లక్ష్మీకటాక్షము అధికముగా కలుగుతుంది. ఎవ్వరైతే తమ సంపదలో అధిక భాగముగానీ పూర్తిగాగానీ సత్యకర్మ కోరకే సంతోషముగా వినియోగించగలుగుతారో వారి సంపద సత్కర్మ ఫలముగా ఎన్నోరెట్లు అభివృద్ధి చెందుతుంది. ఎవరు సత్కర్మ రహస్యముగా చేయుటయేగాక, పైకి దుష్కర్మ చేయువానిలాగ కనిపిస్తారో వారికి రహస్యమందున్న పరమతండ్రి అనేక రెట్లు సత్కర్మ ఫలమును ప్రసాదిస్తారు.

CONTINUE...

శ్రీ శేషుబాబు గారు తన దేహముపై ధరించియున్న సంపదలకు అణుమాత్రమైనా బందీకాకుండా సంపూర్ణముగా భగవదర్పితము చేస్తూ, సంపూర్ణముగా సత్యసేవకే ఉపయోగిస్తూ కూడా, అంతటి సత్కర్మను పూర్తిగా రహస్యము చేసుకుని పైకి మాత్రము తానొక ధనకాంక్ష పరునిగా నటిస్తూ ఇతరులచే విమర్శింపబడుచూ జీవించిన ఆదర్శ శ్రీ లక్ష్మీపుత్రుడైయున్నారు. అన్ని విధాలుగా అంతటి పరిపూర్ణమైన అర్హత కలిగియున్న ఆయన అడుగుపెట్టిన ప్రతిచోటా శ్రీలక్ష్మీమాత తాండవించేస్తుంది. ఆయన నామాన్ని స్మరించినచోట కూడా ఆ తల్లి కటాక్షము సంపూర్ణముగా లభిస్తుంది. ధనాతీతులైన శ్రీ శేషుబాబు గారికి సంపదలు అనితర సాధ్యముగా అభివృద్ధి చెందుతాయి. కానీ ఆయన మనస్సంతా వైరాగ్య భావనతో నిండిపోయి ఉండుటచేత సంపదలను ఎక్కువగా స్వీకరించలేదు. సత్కర్మకు ఉపయోగపడునంత మేరకు మాత్రమే తగుమాత్రముగానే సంపదలు స్వీకరించియున్నారు.

శ్రీ గురుదేవులు ఏనాడూ ధనమునకు అధిక విలువనీయలేదు. ధనమును మించి శిష్యులకు విలువనిచ్చేవారు. సత్కర్మ కొరకు ఉపయోగపడితేనే ధనమునకు సార్ధకత లభిస్తుందని, ధనమును దాచుకొనుట వలన అది మనిషికి భారముగా పరిణమిస్తుందని భావించెడివారు. మనిషికి కీర్తి, ధనము ఎంతగా పెరిగితే అంతగా అవి భారమైపోయి, అవి న్యాయమైన సంపాదన అయినా సరే ఆ మనిషిని బాధిస్తాయి. కావున ప్రతి మనిషి తన సంపాదనలో కనీసము పదియవ వంతైనా సత్కర్మకు, దైవీకార్యములకు వినియోగించాలి. అలా చేస్తే ఆ సంపద అతడికి భారము కాకుండా ఉంటుంది. సంపదలు పెరిగే కొలదీ లోకదృష్టితో చూచేవారికి ఆకర్షణీయముగా కనిపిస్తాయిగానీ సత్వదృష్టితో చూచేవారికి సంపదలు తలపై పెరిగిపోవుచున్న గుదిబండలనే సత్యము కనిపిస్తుంది. ఆ భారము ఎంతగా భాధిస్తున్నాగాని మాయా ఆకర్షణ చేత మనిషి ఆ భారాన్ని దింపుకోవాలనుకోడు. మరింతగా పెంచుకుంటూ భారము పెరిగిపోయి మరింతగా నరకమును అనుభవిస్తూ ఉంటాడు. అందుచేతనే సత్యజ్ఞానులగు శ్రీ రమణమహర్షి వంటి మహాత్ములు గోచీ పెట్టుకుని నిరాడంబర జీవితము గడుపుచూ ఏ బరువూ లేకుండా సుఖమయ జీవితమును గడుపుతుంటారు. లోకములోని బాహ్య ఆడంబర వస్తువులన్నింటినీ సమకూర్చుకొనువారు వాటికి అలవాటు పడిపోయి వాటికి బానిసలైపోతారే తప్ప వాటి నుండి ఏ సుఖమూ పొందలేరు. నిరాడంబరముగా సాత్విక జీవనము గడుపువారే నిజమైన సుఖి అయియున్నారు. దృగ్గోచరము కాని ఆత్మ విషయములనే తమ బుద్ధితో యోచించి గ్రహించగలిగిన శ్రీ రమణమహర్షి వంటి మేధావులకు అర్ధము కానివేముంటాయి ? వారు ధనాన్ని సంపాదించుకోవాలనుకుంటే, షేర్ మార్కెట్‌పై దృష్టి పెడితే ఆ లెక్కలన్నీ సులభముగా కనిపెట్టేయగలరు. ఒక్కరోజులోనే కోటీశ్వరులు అయిపోగలరు. కానీ ధనము అనునది భారము అను సత్యము వారికి తెలియును కాబట్టే బాహ్యసంపదలను పెంచుకొన్నరు.

CONTINUE..

శ్రీలక్ష్మీమాత పుత్రుడగు శ్రీ శేషబాబుగారు కోరుకుంటే ఎంత ధనమునైనా అమ్మయే చిటికెలో ప్రసాదించగలరు. కానీ ఆయన సంఘమునకు శిష్యులకు సేవచేయుట కొరకు తగినంతగా ధనమును ఆశించువారేగానీ ఆస్తులను పెంచుకోవటానికి ఎప్పుడూ ఇష్టపడేవారు కాదు. ఉదాహరణకు ఒకసారి ఒక శిష్యుడు ఒక ఖాళీ స్థలమును ఆయనకు చూపించి, ఆ స్థలము ఇప్పుడు చాలా తక్కువ ధరకు వస్తున్నదని, భవిష్యత్తులో బాగా పెరుగుతుందని, కావున దానినిప్పుడు మనము కొని భద్రపరచుకుందామని సలహా చెప్పినాడు. దానికాయన ఇలా చెప్పినారు. "ఆ స్థలము ఇప్పుడక్కడ నిరుపయోగముగా ఉన్నది. మనము కొన్న తరువాత కూడా అది అలాగే అక్కడే ఉంటుంది. మనకు అరవయ్యేళ్ళ వయస్సు వచ్చినాక చనిపోతాము. అప్పుడీ ఆస్తితోగానీ, ఈ దేహముతో గానీ మనకెట్టి సంబంధము ఉండదు. ఆ ఆస్తి కొనుట వలన 'ఇది నాది' అనే అనుభూతి కలుగుట తప్ప మనం అనుభవించేది ఏమీఉండదు. ఆస్థిని పెంచుకొనుట వలన తలపై పెద్ద బరువును మోయవలసి వస్తుంది. ఇది నాది అనే చిన్న అనుభూతిని పొందుట కొరకు అంత బరువును మోయుట అవసరమా ? అట్టి అనుభూతియే కావాలనుకుంటే ఇంత చిన్న స్థలమెందుకు? కాకినాడలోని పెద్ద సినిమాహాలునే చూచి ఇది నాది అని భావించుకుందాము. ఏ బరువూ మనపైకి రాకుండానే మన అనుభూతి తీరిపోతుంది కదా" అని చెప్పినారు. ఆ విధముగా శ్రీ శేషబాబుగారు ఆస్తులను భారముగా భావించేవారే తప్ప వాటిని పెంచుకోవడానికి, సమకూర్చుకోవడానికి ఎన్నడూ ఇష్టపడేవారు కాదు.

శ్రీ గురుదేవులు చిన్నతనము నుండి ధనము యెడల ఏహ్యాభావమును కలిగియుండి ధనమును కంటితో చూడలేకపోయేవారు. ధనమే మానవులచేత అన్ని పాప కార్యములను చేయించుచున్నదనే ఉద్దేశ్యముతో ధనమును చూస్తే పామును చూచినట్లుగా భయపడేవారు. 1972 నుండి సద్గురుశక్తి కర్మవలన ఆయన ప్రవర్తన సద్గురు చిత్త ప్రకారముగా మార్చుకొనినారు. ఇతరులకు సద్గురుసేవ చేయుట కొరకై తనకు ఇష్టము లేకున్నను ధనమును కలిగియుండుట, లగ్జరీగా ఉండుట వంటి బాహ్య వ్యవహారములను అలవరచుకున్నారు. సద్గురుశక్తి కర్మవలన ఆయన దేహమునకు ధరించబడియున్న దుస్తులు, అలంకారములు, ఆస్తులు వలన ఆయన కూడా లోకములోని ధనవంతులు మాదిరిగా ఉన్నట్లుగానే పైకి కనిపించేవారు. కానీ సద్గురుశక్తి వలన ఆయన దేహకర్మ మారినదే గానీ ఆయన అంతరంగము ఏ మాత్రము మారకుండా ఎల్లప్పుడూ చిన్నప్పటి వైరాగ్యస్థితిలోనే నిలిచియున్నది. ఇతరులకు సద్గురుసేవ చేయుటకై బాహ్యవిషయములను తన దేహమునకు ధరించినారేగానీ అవేవీ ఆయన మనస్సుకు అణుమాత్రమైనా అంటలేదు. ఆయన మనస్సులో ప్రతిక్షణము ఇంకా ఎంత కాలములో అరవయ్యేళ్ళు నిండిపోతాయా అని రోజులు లెక్కబెడుతూ ఉండేవారు.

 CONTINUE..

మనము కాకినాడ వచ్చి ఇన్ని సంవత్సరములైనది ఇంకొక ఇన్ని సంవత్సరములు గడిస్తే అరవయ్యేళ్ళు నిండిపోయి మన ఆయుష్షు తీరిపోతుంది కదా ! ఆ తరువాత మనకు ఈ దేహముతోగానీ, ఈ లోకముతో గానీ, ఈ బంధములతో గానీ, ఈ ఆస్థులతో గానీ ఏ విధమైన సంబంధము ఉండదు కదా ! అని ప్రతిక్షణము లెక్కలు వేసుకుంటూ ఆయన అంతరంగము ఎల్లప్పుడూ వైరాగ్య భావనలతోనే సంపూర్ణముగా నిండియుండేది. కేవలము మనము బాటసారిలా ప్రయాణిస్తూ కొంతసేపు విశ్రమించడానికి ఈ లోకములోనికి వచ్చియున్నాము. వట్టి చేతులతో వచ్చినాము వట్టి చేతులతో వెళ్ళిపోతాము ఇక్కడినుండి వెళ్ళేటప్పుడు పూచిక పుల్లనైనా మనవెంట తీసుకువెళ్ళలేము. అటువంటప్పుడు ఈ తాత్కాలిక మజిలీలో ఆస్తులను సమకూర్చుకొనుటలో ప్రయోజనమేముంటుంది ? మనుష్యులు తమకున్నది అరవయ్యేళ్ళ జీవితమేననే సత్యమును మరచిపోయి వేల సంవత్సరాలకు సరిపోయేలాగా పధకాలను ఆలోచిస్తూ, ఆస్తులను కూడబెట్టుకుంటూ కాలమంతా ఆ ప్రయాసలోను, ఆ భారముతోనే వ్యర్థము చేసుకుంటూ చివరకు వట్టి చేతులతోనే ఈ లోకము నుండి నిష్క్రమించుచున్నారు కదా !. సత్కర్మకు సహకరించునంత మేరకు తప్ప మిగిలిన సంపదలు, ఆస్తులు అన్నియు మాయా భ్రమలే తప్ప వాటిలో సుఖప్రదమైనదేమీ లేదు అనే వైరాగ్య చింతన ఆయనయందు చిన్నతనములో ప్రారంభమై జీవితకాలమంత స్తిరముగా, దృఢముగా ఆయనలో నిలిచియేయున్నది. కర్మయోగిగా శ్రీ శేషుబాబుగారు ధరించియున్న బాహ్యము ఆయన అంతరంగమును ఏనాడూ అణుమాత్రమైనా తాకలేదు. ఆయన దేహమును చూచి ఆయన స్థితిని అంచనా వేసేవారందరూ మాయలో పడినట్లే అగుచున్నది. ఆయన ధరించియున్న బాహ్య ఆకారమంతా మాయయే. శ్రీ శేషుబాబు గారు జీవితకాలమంతా నిశ్చలముగా యోగస్థితిలోనే స్థిరముగా నిలిచియున్న మహర్షియే అయియున్నారు. శ్రీ గురుదేవులు కర్మయోగిగా బాహ్యాకర్మలలో నిమగ్నమైయున్నను అంతరంగములో శ్రీ రమణమహర్షి వలెనే ఆస్తుల భారాన్ని పెంచుకొనుటకు ఇష్టపడే వారు కాదు. శిష్యులకు సేవ చేయుట కొరకు, శిష్యులకు సత్కర్మ చేయుటకు అవకాశమిచ్చుటకు అవసరమైనంత మేరకు మాత్రమే ఆస్తులను ఏర్పరచినారు.

శిష్యులకు సద్గురు సేవను ప్రసాదించుట కొరకు ఎంతటి భారమునైనా మోయుటకు ఆయన ఎల్లప్పుడూ సిద్ధపడియుండేవారు.

